# కామాక్షి - కాసుల పేరు

'అమ్మా! అమ్మా! నాకు కాసుల పేరు చేయించవా?'

"కాసుల పేరా? అదేం కోరికే తల్లీ! కాసుల పేరు చేయించడమంటే మిఠాయి పొట్లం కొనడమనుకున్నావా? అయినా అంత డబ్బు మన కెక్కడిదే?"

"నాకదంతా తెలీదమ్మా! నువ్వు కాసుల పేరు వేయించవలసిందే! నేను అడిగినప్పుడల్లా నువ్వు" లంగా వోణి వేసుకున్నప్పుడు చేయిస్తాలే అనేదానివి. ఇదిగో ఇప్పుడు వోణీలు వేసుకుంటున్నాగా! ఇప్పుడు కాసుల పేరు చేయించవలసిందే!"

"అలా అనకే కామాక్షి! ఈ అప్పడాలొత్తుకుని బతుకుతున్నాం! మనకి కాసుల పేర్లు ఎక్కడ నుంచి వస్తాయె? ఆశకేనా అంతుండాలి. సైకిలే నడవలేనమ్మ విమానం నడుపుతానందిట! ఇల్లే గడపలేని నేను నీకు నగలేం చేయించగలనే!"

నాకదంతా తెలీదమ్మా! నువ్వు కాసుల పేరు చేయించకపోతే

పేరమ్మత్త కూతురు పెళ్ళికి రానేరానమ్మా!"

"అలా పేచీపెడితే ఎలాగె కామాక్షీ! మీ నాన్నె బతుకుంటే నాకీ తిప్పలుండేవి కాదమ్మా! ఈ అప్పడాలసైజులో కాసులపేరు చేయించి నీ కోరిక తీర్చేవారు. బొద్దుగా ఉండే నీమెడ ఎంత నిండుగా ఉండేదో! నువ్వెంత కలకల్లాడిపోయెదానివో? నీ మెడలో కాసులపేరు చూసెయోగం నాకు లేదమ్మా!" ఆమాటలంటుంటె ఆవిడ కళ్ళలో నీళ్ళు తిరిగాయి."

"అలా అనకమ్మా! ఎలాగైన కాసులపేరు చేయించమ్మా!

"నాకూ చేయించాలనే ఉందీ! ఈ అప్పడాల సంపాదనతో మనిద్దరమే బతకలేకపోతున్నాం! ఇంక మనకి వస్తువులు, వాహనాలు ఎక్కడవే? అయినా ఆ కాసులపేరుకే నీమెడలో మెరిసె అదృష్టం లేదేమో!"

"మనం అప్పుడప్పుడు దాచుకునే నోట్లున్నాయి కదమ్మా! రోజూ దాచే చిల్లరుందికదమ్మా! అవన్నీ లెక్కపెట్టుకుని చూసుకుందామమ్మా!"

దానికేం భాగ్యం! అలాగె లెక్కపెట్టుకుందాం! అంతా లెక్కపెడితే నాలుగైదు వందలుండవచ్చేమో? కాసులపేరు ఖరీదు వేలలో ఉంటుందమ్మా! స్టీలుకంచానికి వెండికంచానికి ఎంత తేడాయే తల్లీ! అయినా వెళ్ళి పట్టుకురా!" కామాక్షిముఖం కాసుల పేరు వేసుకున్నంత వెలిగిపోయింది. లోపలకి ఒక్క పరుగు పెట్టింది. లలితమ్మ తిరిగి అప్పడాలొత్తడంలో నిమగ్నమయింది.

కామాక్షి చిల్లర దాచిన అన్నిరకాల డబ్బాలు అక్కడకు పట్టుకొచ్చి పెట్టింది. తల్లికి ఎదురుగా పాత తుంగచాప పరచి కూర్చుంది.

"కాస్సేపు అప్పడాలాపమ్మా!" అంటూనె ఒక్కొక్క డబ్బా

తెరచి తుంగ చాపమీద గుమ్మరించడం మొదలు పెట్టింది.

లలితమ్మ అప్పడాల కర్ర. పీట పక్కకు జరిపింది. మరోవైపు నుంచి ఆవిడకూడా లెక్క పెట్టడం ప్రారంభించింది.

"అమ్మా! నేను లెక్కపెట్టినవి మూడొందలమ్మా! నీ దగ్గ రెంతమ్మా!"

"ఇవి రెండొందలయాభై! ఈ డబ్బుతో కాసులపేరేమొస్తుందే తల్లీ! ఓ బంగారు ఉంగరంకూడా రాదే? "పోనీ ముక్కుకి ఓబే సరి చేయిస్తానే! ఆకు సంపెంగలాంటి నీ ముక్కుకి ఎంత అంద మొస్తుందో!"

"పో! అమ్మా? నాకా బేసర్లు, గీసర్లు వద్దమ్మా! పోనీ వెండి కాసుల పేరు చేయించమ్మా! ఈ డబ్బుతో వచ్చేస్తుందమ్మా!" కామాక్షి తల్లి గడ్డం పట్టుకు బలిమాలింది.

"వెండికాసుల పేరు చేయించడానికి ఓ పది రోజులు పడుతుందే కామాక్షీ! పేరమ్మత్త కూతురు పెళ్ళినాటికి కాసుల పేరుండదే?"

"అసలు నీకేమీ తెలీదమ్మా! మనూరు కంసాలిచేత చేయిస్తే అందరికి తెలిసిపోతుంది. అందరు చేయించేసుకుంటారు. ఇంక నా సరదాయేం తీరుతుంది. అందుకే మనం పట్నం వెళ్ళి అక్కడ కొను క్కుందాం. అక్కడ తయారుచేసినవే అమ్ముతారమ్మా!

"వెండి కాసులపేరు వెలవెలబోతూ ఏం బాగుంటుందే? నాకేం నచ్చదే?"

"వెండి కాసుల పేరంటే బంగారుపూత పూస్తారమ్మా! వచ్చగా మెరిసిపోతూ ఉంటుందమ్మా! అందరూ బంగారందే అనుకుంటారు. పొద్దుటే పట్నం వెడదామమ్మా!

"కానీ కామాక్షీ! పట్నం వెళ్ళిరావడానికి ఏభై రూపాయలవు

తుందా! ఆ కాసులపేరు కొనడానికి డబ్బు చాలుతుందంటావా?॥

"చాలుతుందమ్మా!" ఇంకేమీ ఆలోచించకు! పట్నం వెడదామమ్మా!"

"అలాగెనే తల్లీ! ఇలాగైనా నీ కోరిక తీరితే నాకంతే చాలేతల్లీ!

ఆరాత్రి ఇద్దరూ పడుకున్నారు కాని ఇద్దరికి కంటినిండా నిద్ర లేదు.

"ఎప్పుడు తెల్లారుతుందా! ఎప్పుడు కాసులపేరు కొనుక్కొని మెళ్ళో వేసుకుందామా" అని కామాక్షి కలవరిస్తూనె ఉంది.

"ఎప్పుడు పట్నంలో రిక్షా మీద తిరుగుదామా" అని లలితమ్మ కలలు కంటూనెఉంది.

లలితమ్మకి పట్నంలో తిరగాలంటే చాలా సరద. పల్లెలోనే పుట్టింది. పల్లెలోనే పెరిగింది. పల్లెలోనే కాపురం. అందుకే పట్నమంటే మొదటినుంచి సరదా! భర్త ఉన్నప్పుడు తరచు అతనితో పట్నంవెళ్ళి బజార్లు తిరిగేది. మాట్నీ సినిమాచూసి హొటల్లో టిఫిన్ తిని రాత్రికి యిల్లుచేరేది.

ఇప్పుడలా తరచు పట్నం వెళ్ళడానికి వీలులేదు. చేతిలో డబ్బూలేదు. ఈ వంకనేన పట్నం వెడుతున్నందుకు లలితమ్మకు చాలా సంతోషంగా ఉంది.

తెల్లవారకుండానే ఇద్దరు పట్నం వెళ్ళే బస్సు ఎక్కారు. దుకాణాలు తెరచే సమయం కాకుండానే తల్లీ, కూతురు పట్నం చేదుకున్నారు. ఇద్దరి సంతోషానికి అంతులేదు.

బస్సుస్టాండులో రిక్షా ఎక్కారు. సాంబయ్య దుకాణం దగ్గర రిక్షా దిగారు. సాంబయ్య దుకాణం పెసరట్లకి అల్లప్పచ్చడికి చాలా ప్రసిద్ధి. ఇద్దరు పెసరట్లు తిని కాఫి తాగారు.

"ఎన్నాళ్ళికి తిన్నానె ఈ పెసరట్టు. చచ్చిపోయిన జిహ్వ తిరిగి వచ్చిందనుకో."

"ఏం పెసరట్టే అమ్మా!" అదిగో గడియారం చూడమ్మా! దుకాణాలు తెరిచేస్తారె. నడు నడు" కామాక్షి తల్లిని తొందరచేసింది.

ఇద్దరు తిరిగి రిక్షా ఎక్కి వెండి దుకాణాల దగ్గరదిగారు. దుకాణాల పేర్లు చూసుకుని ఒక దుకాణంలోకి వెళ్ళారు. ఎదురుగుండా అనేక వస్తువుల మధ్యలో కామాక్షి కంటికి కాసులపేరు కనబడింది.

"అమ్మా! కాసులపేరు!" అంటు ఉత్సాహం ఆపుకోలేక గట్టిగా అరిచింది.

దుకాణం యజమానితో సహా అందరు కామాక్షి వైపు ఆశ్చర్యంగా చూసారు. అవేమి పట్టించుకునే స్థితిలోలేదు కామాక్షి.

"ఆ కాసులపేరు చూపించు నాయనా! అంటు లలితమ్మ ఓ బల్ల ముందు కూర్చుండిపోయింది. ఆమె పక్కన కామాక్షి చేరింది.

షోకేసులోనుంచి కాసులపేర్లు వరుసగా అక్కడపెట్టారు. అన్నింటికంటె పొడవుగాఉన్న కాసులపేరు చూసుకుంది కామాక్షి.

"అమ్మా! ఇది చాలా బాగుందే" అంది.

లలితమ్మ ఆ కాసులపేరు తూకం వేయించింది. అది ఎనిమిది వందలవుతున్నాడు దుకాణం యజమాని.

"నాలుగు, అయిదువందల్లో కాసులపేరు చూపించు నాయనా" అంది తిరిగి లలితమ్మ. వాళ్ళు విసుక్కుంటూనె కాసుల పేర్లన్నీ తూచడం మొదలుపెట్టారు.

మొత్తానికి 450 రూ॥ ఒక కాసులపేరు దొరికింది. కామాక్షి సంతోషానికి అంతులేదు.

"అమ్మా! బంగారు నీరు పోయించమంటారా?" అతనే అడిగాడు. కామాక్షి మనస్సు గాలిలో తేలిపోయింది. లలితమ్మ కూడా చాలా సంతోషించింది. అంత తేలిగ్గా బంగారం లాంటి కాసులపేరు దొరుకుతుందనుకోలేదు లలితమ్మ. బంగారుపూత పెడుతుంటె కామాక్షి పక్కనే కూర్చుంది. ఎండ వేడి భగ్గుమంటున్నా ఆమెకు తెలీదంలేదు. మొత్తంమీద బంగారు రంగులో మెరిసిపోతూ కాసులపేరు తయారయింది.

ఎర్రని కాగితంలో చుట్టి దాన్ని వెల్వెట్ కవరులో పెట్టి దాన్ని మరో ప్లాస్టిక్ డబ్బాలో పెట్టి ఇచ్చాడు యజమాని. లలితమ్మ డబ్బు ఇచ్చేసింది.

దాన్ని అందుకుంటుంటె కామాక్షి చేతులు వణికాయి. గుండె వేగంగా కొట్టుకుంది.

తల్లీ కూతుళ్ళు మరోసారి కాసులపేరు బయటకుతీసి చూసుకున్నారు.

"ఎంత అందంగా ఉందోనమ్మా! నేను ఇలాంటి కాసులపేరే కావాలనుకున్నానమ్మా!"

"అంతా నీ అదృష్టం కామాక్షీ."

"అమ్మా! అమ్మా! వేసుకుచూస్తానె" కామాక్షి మారాంచేసింది.

"దానికేం! అలాగే వేసుకు చూడవే?"

కామాక్షి వెంటనే కాసులపేరు మెళ్ళో వేసుకుంది. వెళ్ళి ఓ అద్దంముందు నిలబడింది.

"ఎంత మెరిసిపోతోందే అమ్మా!"

కూతురు మెడ చూడగానే లంలితమ్మ కళ్ళలో ఆనందబాష్పాలు నిలిచాయి. కూతురు మెడనిండుగా కనబడింది.

"కాసులపేరు ఎన్ని తులాలండీ" అప్పుడే షాపులో అడుగు పెట్టిన ఒకమ్మాయి అడిగింది.

"లలితమ్మ నోరుతెరచి ఏదో చెప్పబోయింది. అంతలో షాపు యజమాని "అది వెండికాసుల పేరండి! ఇదిగో ఈ మోడలే! బంగారు పూత పెట్టించుకున్నారండీ" అంటు మరో వెండి కాసులపేరు చూపించాడు.

"ఎంత బాగుందండీ! నేనుకూడా కొనుక్కుంటానండీ" పక్కనే ఉన్న భర్తను అడిగింది.

"దానికేం కొనుక్కో" అన్నాడు భర్త.

"అమ్మా! మనం ఇక్కడే ఉంటే మన కాసులపేరుచూసి ఎంతో మంది చేయించుకుంటారె. మనం ఇక్కడనుంచి వెళ్ళిపోదాం" కామాక్షి మెల్లిగా తల్లి చెవిలో చెప్పింది. కామాక్షి మెదనుంచి కాసులపేరు తీసింది.

దుకాణం వాళ్ళు సర్దినట్లుగానే కామాక్షి సర్దుకుని చేతిసంచీలో పెట్టింది. తల్లి మరోసారి సంచీలో చేయిపెట్టి తడిమి చూసింది.

ఇద్దరు దుకాణం బయటకు వచ్చి రిక్షా మాట్లాడుకుని ఎక్కారు.

ఈసారి ఇద్దరు అయ్యరు హోటల్ దగ్గర దిగారు. సంచీ మరో సారి చూసుకుని హోటల్లో అడుగుపెట్టారు.

హోటల్లో భోజనంచేసి ఇద్దరు తిరిగి వాళ్ళూరు వెళ్ళే బస్సు ఎక్కారు. వయస్సు మళ్ళిన లలితమ్మ బస్సులోకూర్చోగానె నిద్ర పోయింది. కామాక్షి మాత్రం కాసుల పేరును తలచుకుంటూ కళ్ళు మూసుకోలేకపోయింది.

ఊరు రాగానె యిద్దరు బస్సు దిగి నడుచుకుంటూ ఇంటికి బయలుదేరారు.

"ఎక్కడికి కెళ్ళావే కామాక్షి" అని ఒకళ్ళు

పట్నం "వెళ్ళావా లలితమ్మా!" మరొకరు.

"పట్నంనుంచి ఏం తెచ్చావే" అని మరొకరు దారి పొడుగునా తల్లీ కూతుళ్ళను అడుగుతూనె ఉన్నారు ఆడవాళ్ళు.

"అప్పుడే చెబితే ఎట్లా! ఇంటికిరండి చూపిస్తా" కామాక్షి సమాధానాలు చెబుతూనె ఉంది. ఆ·మాటలు విన్న వాళ్ళందరికి చాలా కుతూహలంగా ఉంది! అదేమిటో వాళ్ళకి వెంటనే చూడాలనే ఉంది.

కామాక్షి, లలితమ్మ ఇంట్లోకి రాగానె వీధి తలుపులు గడియ పెట్టుకున్నారు.

కాసులపేరు తీసి మరోసారి చూసుకున్నారు. ఇద్దరు టీ పెట్టుకుని తాగారు—

కామాక్షి గబగబా స్నానం చేసి ఇస్త్రీ బట్టలు వేసుకుంది. పౌడరు రాసి తిలకం బొట్టు పెట్టిది. పట్నంలో కొనుక్కుతెచ్చుకున్న పువ్వులు తల నిండా పెట్టుకుంది.

"అమ్మా! తయారయ్యానె" అంటు తల్లి దగ్గరకు వచ్చింది. లలితమ్మ కాసులపేరు సంచీలోనుంచి తీసి కామాక్షి మెడలో వేసింది.

"ఎంత కలకల్లాడిపోతున్నావె నా తల్లీ! నీ మెడ ఎంత నిండుడా ఉందే నిన్నిలా చూసె అదృష్టం నాకుపట్టిందే" అంటు మెటికలు విరిచింది.

"నా దిష్టే తగులుతుందే తల్లీ!" అంటు చీపురుపుల్లలతో దిష్టి తీసి పడేసింది.

అంతలో వీధి తలుపు ఎవరో కొడుతుంటే వెళ్ళి లలితమ్మే తలుపు తీసింది.

ఇంకేముంది. దారిలో కనపడ్డ ఆడవాళ్ళంతా ఒక్కొక్కరే రావడం మొదలు పెట్టారు.

లలితమ్మ అందరిని చాపలు వేసి కూర్చోపెట్టింది.

కామాక్షి మెరుపులా వచ్చి వారిముందు కూర్చుంది. కామాక్షి మెడ చూడగానె అందరి కళ్ళు జిగేలు మన్నాయి.

"ఎంత కొన్నావే?"

"ఎన్ని తులాలె"

"ఇంత డబ్బు ఎక్కడిదే."

చేత్తో పట్టుకుని కాసుల పేరు చూస్తూ అందరు తలో ప్రశ్న వేసారు.

"మూడు తులాలు పెద్దమ్మా!" కామాక్షి తడుముకోకుండా సమాధానం చెప్పింది.

"తులమంటె మాటలా? పది వేలన్నమాట"

"అంత డబ్బే" తిరిగి ప్రశ్నలు.

"ఏదో! అప్పుడు అప్పుడు దాచుకున్నది పెట్టి చేయించాను పిన్ని! పిల్ల సంబరంకంటె నాకేం కావాలి చెప్పు?"

"నిజమే లలితమ్మా!" నీలాటి జాగ్రత్తపరులు ఈ రోజు కాగడా వేసి వెతికినా కనబడరు?"

"అయినా దేనికైన ప్రాప్తముండాలి లలితమ్మా!"

"డబ్బు ఎందరికి లేదు! ఇలా పిల్లల సరదాలు తీర్చేవారు ఎందరేతల్లీ."

వచ్చిన ఆడవాళ్ళందరు తలోవిధంగాను లలితమ్మను పొగిడారు.

లలితమ్మ సాధారణంగా ఏదో ఒకటి చేసి ఇంట్లో ఉంచుతుంది ఆరోజు అందరికి పేలాల ఉండలు పెట్టి పంపించింది. ఆనోట ఆనోట కామాక్షి కాసులపేరు సంగతి ఊరంతా మరునాటికి పాకిపోయింది.

"కామాక్షీ! నీ కాసులపేరు అందరికీ నచ్చిందే" లలితమ్మ.

కాసులపేరు తిరిగి డబ్బాలో పెడుతూ అంది.

"ఈ వూళ్ళో ఇలాటి కాసులపేరు ఎవరికుందే అమ్మా! మనం జాగ్రత్తగా ఉండాలె! నిజంగా బంగారం అనుకుని ఏ దొంగాడైన రాగలడు."

"ఎంతాలోచనే కామాక్షీ నీకు! నిజమే! మనం జాగ్రత్తగానే ఉండాలి. ఊరిడిమంది కళ్ళు దీనిమీదే ఉన్నాయి. అందరిని బుట్టలో పెట్టేసాం" లలితమ్మ గర్వంగా పలికింది.

"అమ్మా! అమ్మా! డబ్బు దాచి నాకు చేతికో ఒంకీ, గాజులు చేయించవే అమ్మా!"

"దానికేం భాగ్యమే అమ్మా! అలాగె చేయిస్తాను. రేపటినుంచి రేడియోలో సినిమా పాటలు వినడం మానేసి నాతోపాటు అప్పడా లొత్తవే! రెండు నెలలలో నీకు గాజులు చేయించేస్తానూ."

"తప్పకుండా అమ్మా!"

ఆరాత్రి కాసులపేరు సంచీ తలకింద పెట్టుకున్నారు. మరోసారి తలుపుల గడియలు చూసుకున్నారు.

ఎక్కడ ఏ చప్పుడైన తల్లీ, కూతురు లేచి ఇల్లంతా చూస్తూనే ఉన్నారు.

మరునాడు మంగమ్మ గారింట్లో మనవడి పుట్టినరోజు. కామాక్షీ కాసులపేరు వేసుకుని అందరికంటె ముందు బయలుదేరింది.

అక్కడ అందరికి కామాక్షి కాసులపేరు సంగతే! అందరి మధ్యలో మహారాణీలా కూర్చుంది కామాక్షి. అందరు ఆమె చుట్టూ చేరారు. ఎన్నో విధాల కాసులపేరును పొగిడారు.

"కాసులపేరు వల్ల తనకి ఎంత పేరు ప్రతిష్ఠలు వచ్చాయో" అనుకుంది కామాక్షి.

కామాక్షి ఇల్లు చేరుకుంది. అక్కడ జరిగినసంగతి తల్లితో చెప్పి మురిసిపోయింది.

"కామాక్షీ! నా తల్లీ ! ఉన్నావా?" అంటు వక్కింటి తాయారమ్మగారు తయారై వచ్చింది.

"ఏమిటి పిన్నీ బాగున్నావా?" లలితమ్మ పలకరించింది.

"ఏం లేదమ్మా! మా అమ్మాయి తోడికోడలు చెల్లెలు పెళ్ళికి వెళ్ళాలమ్మా! ఓమాటు మీ కాసులపేరిస్తే వెళ్ళి వస్తుందమ్మా!" ఆస్మా పేషెంటు మూలంగా ఆయాసపడుతూ అడిగింది.

"అలాగా తాయారమ్మ పిన్నీ! మా కామాక్షి పిచ్చిది పిన్నీ! దానికి కాసులపేరంటే ప్రాణం! అదిలేందే అన్నం తినదు. నిద్రపోదూ! ఏమీ అనుకోకు పిన్నీ! కాసులపేరు నాదికాదుగా! నా కూతురు కాసుల పేరు ఎవ్వరికీ ఇవ్వదు పిన్నీ!"

"పొద్దుటే ఇచ్చేస్తుందే లలితమ్మ తల్లీ!"

"అదేం లాభంలేదు పిన్నీ! నువ్వెళ్ళిరా! అనవసరంగా ఆలస్య మవుతుంది! అదెలాగు కాసులపేరివ్వదు-" లలితమ్మ తొందరచేస్తుంటె తాయారమ్మ యింక ఉండలేక యింటికి బయలుదేరింది.

ఆమె వెళ్ళగానె ఇద్దరు తలుపువేసుకుని గడియ పెట్టుకున్నారు.

"ఇదెక్కడి బాధేతల్లీ! ఇలా చంపేస్తున్నారు! ఎలాగో అలాగ పంపించేసానే కామాక్షీ!" ఆవిడ గుండెలమీద వేసుకున్న చేతులు తీసేసింది.

"ఎలాగో అలాగ ఈ గండం గడిచించే అమ్మా!" కామాక్షి తల్లిని కౌగలించుకుంది.

మరునాడు మధ్యాహ్నమయింది. పొద్దుటనుంచి ఎవరు రానందుకు తల్లీ కూతుళ్ళు సంబరపడిపోయారు. పొద్దుటనుంచి వీధి తలుపులు

వేసుకునే ఉన్నారు. అప్పుడే వీధి తలుపులు తెరచుకుని అప్పడాలు ఒత్తుకుంటున్నారు.

అంతలో కాంతమ్మ అక్కడకు వచ్చింది.

"ఏమే కాంతం బాగున్నావా?" లలితమ్మ పలకరించింది. ఆమే అంత ప్రమాదం మనిషికాదనుకుంది లలితమ్మ.

"ఏమే కామాక్షీ! నీకాసులపేరు ఒకసారియిస్తావా? మీ బావగారు నీ కాసులపేరు చూస్తారుట! నాక్కూడా చేయిస్తానంటున్నారు. ఒకసారి కంసాలికి చూపించి తీసుకువస్తాను?"

లలితమ్మకు పచ్చి వెలక్కాయగొంతులో పడ్డట్టయింది. నోట మాటరాలేదు.

"కాంతమ్మక్కా! నాకాసులపేరు బావగారికి అంతగా నచ్చిందా! నీకూ కాసుల పేరు చేయిస్తారా? మనిద్దరం ఒకేసారి పెట్టుకోవచ్చు! అయినా మళ్ళీయిలాంటి కాసులపేరే ఎందుకు? మరోరకం చేయించుకుంటె బాగుంటుంది. మనిద్దరం ఎప్పుడైన ఒకరిది మరొకరు పెట్టుకోవచ్చు—కంసాలి దగ్గర బోలెడన్నిరకాలుంటాయి. ఇక్కడికేపట్టుకురమ్మను. నేనే నీకు సెలక్టు చేసి పెడతాను" కామాక్షి మాటలకి కాంతమ్మ మరోసారి అడగలేక "సరే కామాక్షీ!" అంటు అక్కడ నుంచి వెళ్ళిపోయింది. కూతురు తెలివికి లలితమ్మ మాత్రం కళ్ళు తేలేసింది.

"ఇదంతా ఏదో గూడుపుఠానీయేమో? అందరిదృష్టి మన కాసుల పేరు మీదనే ఉందమ్మా!"

"ఇదెక్కడి తెడదవచ్చిపడిందే తల్లీ! వీళ్ళనోర్లుపడిపోను. వీళ్ళ కంట్లో పువ్వులెయ్యా! వీళ్ళ కాళ్ళుపడిపోను"

తేరుకున్న లలితమ్మ తిట్టడం మొదలుపెట్టింది.

ఆరోజు పేరమ్మత్త కూతురు పెళ్ళి. లలితమ్మ కామాక్షి ముందు గానె బయలుదేరి పెళ్ళికి వెళ్ళారు.

ఎవరైన కాసులపేరు అరువు అడుగుతారని ఓ పక్క భయపడు తున్నారు. మరోపక్క ఎవరైన దొంగిలిస్తారేమోనని భయపడుతున్నారు. తల్లీ కూతురికి కాసులపేరు సంగతీ తప్పమరోసంగతేలేదు.

"ఇదేమిటే? ఈ కాసులపేరు ఇంతతేలిగ్గా ఉంది. అసలు బరువే లేదు. మూడు తులాలు ఎక్కడఉంటుందే" ఎవరు సంతోషంగా ఉన్నా చూడలేని ఓ యిల్లాలు తోచినట్లు మాట్లాడుతూనె ఉంది.

"ఇంకొంచెం పొడవు ఉండవలసిందే! కొంచెం పొట్టిగాఉందే కామాక్షీ" మరో ఆవిడ వ్యాఖ్యానం చేసింది.

"కాసులు మరీ చిన్నవిగా ఉన్నాయి. మా అమ్మమ్మకాసుల పేరులో కాసులు రూపాయి కాసంత ఉండేవి" ఎవరు ఏది పెట్టుకున్నా చూడలేని మరో వనితామణి నోటిదురుసు తనం బయట పెట్టుకుంది.

కామాక్షి ముఖం ముడుచుకుపోయింది. ఎంతకాదనుకున్నా వారి మాటలు భరించలేకపోతోంది. లలితమ్మ వాళ్ళని మనస్సులోనె తిట్టు కుంటోంది.

అంతలో అటుగా వచ్చిన పేరమ్మ "కామాక్షి అందరికి బొట్లు పెట్టవే?" అంటూ పురమాయించింది.

కామాక్షి సంబరంగా ఆవిడ వెంటకదిలింది. ఓపక్క పెళ్ళవు తోంది. బాజాలు మోగుతున్నాయి. కామాక్షి అందరికి బొట్లు పెట్టి. పన్నీరు జల్లుతోంది.

వయసు వచ్చిన మగపిల్లలంతా పెళ్ళి మండపంచుట్టూ చేరారు. ఆడపిల్లలందరిలో కలకల్లాడిపోతున్న వారి దృష్టి కామాక్షి మీద పడింది. కామాక్షి కూడా వారిని ఓరగా చూస్తూనె ఉంది.

"కామాక్షీ! కలకల్లాడిపోతున్నావే తల్లీ!" అంటు కామాక్షి బుగ్గలు నొక్కింది నాంచారమ్మ. కామాక్షికి వరుసకు మేనత్త అవుతుంది ఆవిడ.

లలితమ్మ ఆవిడ కలిసి మెలసి ఆప్యాయంగా మాట్లాడుకున్నారు.

"నువ్వు" ఊఅంటె నాకొడుక్కి నీకూతుర్ని చేసుకుంటానె అంది ఆవిడ. కాసుల పేరు ఏ బయటవాళ్ళకి వెళ్ళిపోతుందేమోనని ఆవిడబాధ!

"అంతకంటేనా" ఒదినా!" అంటూ లలితమ్మ ఆవిడ రెండు చేతులూ పట్టుకుంది.

"నా కొడుకును పిలుస్తానుండు. మరదల్ని చూసుకుంటాడు." అంటూ ఆవిడ కొడుకును పిలుచుకు వచ్చింది.

"ఒరే! నీ పెళ్ళామురా!" అంటు కామాక్షిని చూపించింది

సుబ్బా అని పిలవబడె సుబ్బారావు కామాక్షిని చూసి "హలో" అన్నాడు.

"హాయ్" అంది కామాక్షి.

లలితమ్మ ఆశ్చర్యంగా చూస్తోంది.

"నా కొడుకు బి.ఎ. చదువుతున్నాడె! కానీ కట్నం అక్కర లేదు తెలుసా! ముహోర్తాలు పెట్టించు" అంటు ఆజ్ఞాపించింది నాంచారమ్మ.

"అలాగె ఒదినా" అంటు సమాధానమిచ్చింది లలితమ్మ! లలితమ్మకి లోపల చాలా భయంగా ఉంది.

ఆ కాసులపేరు బంగారంది కాదని తెలిస్తే నాంచారమ్మ పెళ్ళిలో ఏ అల్లరి చేస్తుందోనని కంగారు పడుతోంది. కామాక్షి మాత్రం చాలా ధైర్యంగా ఉంది. పెళ్ళయితే మాత్రం "నాకాసుల పేరునా పెట్లోనె దాచుకుంటా! ఆవిడను నాకాసులపేరు ముట్టుకోనిస్తానా?" అనుకుంటూ మరింత హుందాగా నడుస్తోంది.

ఆ సాయంకాలం భోజనాలు వడ్డిస్తుంటె చాటుగావచ్చి సుబ్బారావు కామాక్షి జడపట్టుకు లాగాడు.

ఇద్దరు ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు. మరోసారి ఎవ్వరు చూడకుండా కామాక్షి తన జడ కుచ్చులతో అతని నడ్డిమీద కొట్టి పారి పోయింది. సుబ్బారావు గాలిలో తేలిపోయాడు. మరునాడు-సుబ్బారావు, నాంచారమ్మ వెళ్ళిపోయారు. వెళ్ళేటప్పుడు మరోసారి పెళ్ళి సంగతి హెచ్చరించి వెళ్ళింది నాంచారమ్మ!

"పూట గడవటమే కష్టంగా ఉంటే ఈ పెళ్ళి ఖర్చు ఎలాగే" లలితమ్మకు చెప్పలేని భయం పట్టుకుంది.

నాలుగు రోజులు తల్లీ కూతురు పెళ్ళివారింట్లో హాయిగా కాల క్షేపం చేసారు. ఆ నాలుగు రోజులు కామాక్షి మెడలోనుంచి కాసుల పేరు తియ్యనేలేదు. ఏ అర్ధరాత్రో తీసి పెట్లోదాచేది. తెల్లారకుండా ముస్తాబై మళ్ళీ వేసుకునేది. అందరు కామాక్షీ అదృష్టాన్ని పొగుడు తూనేతున్నారు.

"లలితమ్మా! ఈ రోజుల్లో ఆడపిల్లల పెళ్ళంటే మాటలా! వెతక్కుండానె సంబంధం దొరికిందే! ఎంతైన కామాక్షీ అదృష్టవంతు రాలె" లన్నారు కొందరు.

"బంగారు కాసులపేరు చేయించావు? బంగారంలాంటి అల్లుడు దొరికాడమ్మా! కామాక్షి! అదృష్టవంతురాలే" అలా ఎన్నో మాటలు వినబడుతున్నాయి.

కామాక్షి, లలితమ్మ పొద్దుటే లేచి ప్రయాణానికి తెమలడం మొదలు పెట్టారు. కామాక్షి తల్లికంటె ముందు ముస్తాబై కూర్చుంది.

"అమ్మా! అమ్మా! కాసుల పేరివ్వవే" అంటు తల్లిని తొందర చేసింది.

"ఉండవే? ఏకంగా పెట్టి ఒకేసారి తీస్తానుండు" అంటు లలి తమ్మ కూడా స్నానంచేసి వచ్చింది.

పెట్లోనుంచి చీర తీసుకుని కట్టుకుంది. తరువాత కాసులపేరు పెట్టి కామాక్షికి అందించింది.

కామాక్షి పెట్టె తెరచి గబగబా కాసులపెరు మెళ్ళో వేసుకుంది. రోజులాగె అద్దం చూసుకున్న కామాక్షి కెవ్వున అరిచింది.

"ఏమయిందే" పెట్టికి తాళం పెడుతున్న తలితమ్మ తలెత్తి చూసింది.

"అమ్మా! కాసులపేరు" కామాక్షి చెప్పలేకపోయింది.

"ఏమయిందే" తల్లి రెట్టించింది.

"కాసులపేరు తెల్లబడిపోయిందమ్మా!" కామాక్షి వెక్కి వెక్కి ఏడ్చింది.

"ఏడవకే ఎవ్వరైనా చూస్తే బాగుండదు. ఆ కాసులపేరు తీసి పెట్లో పెట్టేసెయ్యి" లలితమ్మ తొందర చేసింది.

కామాక్షి కాసులపేరు తీసి పెట్లో పెట్టేసింది.

"కంగారుపడకు. పట్నంవెళ్ళి బంగారు నీరు పూయిద్దాము లేమ్మా! ఏడవకు." తల్లి మాటలకు కామాక్షి ఏడుపు మానేసింది.

"అదేమిటి కామాక్షీ! కాసులపేరు వేసుకోలేదేమ్మా" పేరమ్మత్త ఎదురుగా వచ్చి అడిగింది.

''దారిలో దొంగలభయమని పెట్టెలో భద్రంగా దాచానొదినా'' లలితమ్మ తక్కువ సమాధానమిచ్చింది.

అక్కడే నిలబడితే మరెవరైన కాసులపేరు సంగతి అడుగుతారేమోనని భయపడింది కామాక్షి.

లలితమ్మ పెట్టె చేతపట్టుకుని ముందుకు అడుగులేసింది. తల్లి వెనకే కామాక్షి నడిచింది.

లలితమ్మ అప్పడాల పిండి కలుపుతోంది.

''నాకింక ఒంకీ, గాజులువద్దమ్మా! బంగారు మెరుగులు పెట్టించు

కోలేక చావాలి." అంటూనె కామాక్షి తల్లికంటె చురుగ్గా అప్పడాలు తయారుచెయ్యడం మొదలు పెట్టింది.

"నువ్వింత చురుగ్గా పనిచేస్తే ఇకేంకావాలె తల్లీ! నీ పెళ్ళి ఘనంగా జరిపిస్తానే. ఆ మాయదాది వస్తువులు మనక్కెందుక్కాని నీ కాసులపేరుకి మాత్రం ఎన్నిసార్లైనా మెరుగుపెట్టిస్తానే! అంతా ఆ కాసులపేరు మహిమే తల్లీ!"

చిలిపిగా నవ్వుతూ సుబ్బారావు కామాక్షి కళ్ళముందు నిలిచాడు.

ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ కామాక్షి మరింత పట్టుదలతో అప్పడాలు తయారు చెయ్యడం మొదలుపెట్టింది.

10-4-94

* *